ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శనివారం 10 మే 2025 | 5

దేశ సరిహద్దుల్లో..



మా కుమారుడు దేశ రక్షణలో భాగస్వామి కావడం ఆనందంగా ఉంది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో దేశ రక్షణకై పోరాడడం మామూలు విషయం కాదు.. ప్రాణాలెదురొడ్డి పోరాడాలి. మనం ఇక్కడ భయపడితే వారు అక్కడ భయపడతారు. అలా కాదు.. మనం ధైర్యంగా ఉండాలి.. వారిలో ధైర్యాన్ని నింపాలి.. ఇదీ అల్లవరం మండలం ఈటీవారి గ్రామానికి చెందిన యీటి చిన శివకుమార్ తల్లిదండ్రులు గోపాలరావు, కాశీరామేశ్వరి స్పందన. మా రెండో అబ్బాయి యీటి చినశివకుమార్ 20 ఏళ్లుగా ఆర్మీ ఎయిడ్ డిఫెన్స్ విభాగంలో విధుల్లో ఉంటున్నాడు. ప్రస్తుతం భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధం నెలకొన్న నేపథ్యంలో చిన శివకుమార్ జమ్మూ బోర్డర్ సమీపాన ఉద్దంపూర్‌లో సైనిక విధుల్లో ఉన్నాడని వారు తెలిపారు. కుటుంబ పరంగా ఆందోళన కలిగిస్తున్నా, దేశం తరఫున పోరాడుతున్నందుకు గర్వంగా ఉందని తెలిపారు.







హై..అలర్ట్!

భద్రత.. కట్టుదిట్టం

భారత్ - పాకిస్తాన్ యుద్ధ వాతావరణం నేపథ్యంలో రోజురోజుకు పరిణామాలు మారుతున్నాయి. దేశవ్యాప్తంగా సముద్ర తీర ప్రాంతాల్లో ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. పోర్టులు, నౌకాశ్రయాల్లో భద్రత పెంచింది. సముద్ర జలాల ద్వారా ముష్కరులు వచ్చే అవకాశం ఉందన్న హెచ్చరికలతో తీర ప్రాంతాల్లో భద్రతను రెండంచెల స్థాయికి పెంచారు. జిల్లా పోలీసులు, కోస్టు గార్డ్ సిబ్బంది, కస్టమ్స్, పోర్టు అధికారులు అప్రమత్తమై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్లతో నిరంతరం నిఘాను పెంచుతూ తీరంలోని కదలికలను పరిశీలిస్తున్నారు. షిప్‌యార్డులు, సీ పోర్టుల్లో ఉన్న విదేశీ నౌకలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మరోవైపు మధురపూడి విమానాశ్రయం, రైల్వే స్టేషన్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.



- తీరాన ముమ్మర గస్తీ
- కోస్ట్‌గార్డ్, మెరైన్ బృందాల తనిఖీ
- చమురు నిక్షేపాలకు ప్రత్యేక రక్షణ
- విమానాశ్రయంలో రెడ్ అలర్ట్
- 800 ఏపీఎస్‌పీఎఫ్ సిబ్బంది
- 3 రోజులుగా సాగుతున్న మాక్‌డ్రిల్

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దేశ సంపదలో కీలకంగా ఉండే కృష్ణా గోదావరి బేసిన్ పరిధిలోని చమురు, సహజ వాయువు క్షేత్రాల వద్ద హైఅలర్ట్ ప్రకటించారు. తీర ప్రాంతం వెంబడి ఉన్న అపార చమురు నిక్షేపాలు కలిగిన ప్లాంట్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. శాటిలైట్ ద్వారా నిఘా పెంచారు. సముద్రం వెంబడి కోస్టుగార్డు, మెరైన్ పోలీసుల గస్తీ నౌకలు పర్యవేక్షిస్తున్నాయి. గత మూడు రోజులుగా కోనసీమలోని సముద్ర తీరం వెంబడి ఉన్న చమురు, గ్యాస్ నిక్షేపాల కేంద్రాల వద్ద సీఐఎస్ఎఫ్, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నారు. అనివార్య పరిస్థితుల్లో సైరన్ వినిపిస్తే ప్రజలు ఎలా స్పందించాలి అనే దానిపై కూడా వారు స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు. రహదారులపై అర్ధరాత్రుళ్లు తనిఖీలు చేస్తున్నారు. అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. ఎక్కడి నుంచి వస్తున్నారు? ఎక్కడికి వెళుతున్నారు? వంటి విషయాలపై ఆరా తీస్తున్నారు. మొత్తంగా కోస్తా తీరంలో బలగాలన్నీ అప్రమత్తమయ్యాయి.

- (అమలాపురం/ కాకినాడ/ రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తీరాన నిఘా...

కోనసీమ జిల్లా పరిధిలోని అంతర్వేది నుంచి ఐ.పోలవరం మండలం హోప్‌ఐలాండ్ వరకు ఉన్న సముద్ర తీరం వెంబడి అపార చమురు, సహజ వాయువుల నిక్షేప కేంద్రాలు ఉన్నాయి. సముద్రపు లోతు జలాల్లో బావుల ద్వారా ఉత్పత్తి అయ్యే గ్యాస్, ఆయిల్‌ను ప్లాంట్ల ద్వారా శుద్ధిచేసి విశాఖ లేదా ఇతర రాష్ట్రాలకు తరలించడం ద్వారా వేల కోట్ల ఆదాయాన్ని ఆ సంస్థలు ఆర్జిస్తున్నాయి. జిల్లా పరిధిలోని రిలయన్స్, జీఎస్‌పీఎస్, ఎస్.యానాంలోని వేదాంత, ఓడలరేవులోని ఓఎన్జీసీ ప్లాంటు, కేశనపల్లి, కరవాక ప్రాంతాల్లో ఉన్న ప్లాంట్లతో పాటు అత్యంత కీలకంగా ఉండే నగరంలోని జీసీఎస్‌లతో పాటు కోనసీమవ్యాప్తంగా 30కు పైగా ప్రాంతాల్లో చమురు, సహజవాయువుల అన్వేషణ కేంద్రాలు ఉన్నాయి. సీఎస్ఎఫ్, అగ్నిమాపక, పోలీస్‌తో పాటు స్థానికంగా ఉండే వివిధ శాఖల అధికారుల పర్యవేక్షణలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తూ ఆయా ప్రాంతాల్లోని ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు, అనుమానాస్పద వస్తువులు కనిపించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, మెరైన్ పోలీసులు, వేదాంత సిబ్బంది స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాంట్ల పరిసరాల్లో ప్రజల కదలికలపై నిఘా ఉంచాల్సిందిగా సూచించారు. చమురు క్షేత్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా కంపెనీలకు చెందిన ప్రతినిధులతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఇతర వ్యక్తుల సంచారంపై నిఘా ఉంచాలని, సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, వారి కదలికలపై కూడా నిఘాను పటిష్ఠం చేయాల్సిందిగా సూచించారు. సముద్రపులోతు జలాల్లో ఉన్న వివిధ సంస్థలకు చెందిన ఆఫ్‌షోర్ ప్లాట్‌ఫారాల వద్దకు నౌకలు, భారీ బోట్‌లు వంటివి ప్రయాణించకుండా కోస్టుగార్డు బృందాలు నిఘా ఉంచాయి. రిలయన్స్, గుజరాత్ పెట్రోలియం, ఓఎన్జీసీ సంస్థలతోపాటు ఇతర ప్రైవేటు సంస్థలకు చెందిన ప్లాట్‌ఫారాల ద్వారా చమురు, సహజవాయువుల అన్వేషణ జరుగుతోంది. మరో వైపు కాకినాడ యాంకరేజ్, డీప్‌వాటర్ పోర్టులో భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. కేసీపీఎల్‌లో కూడా వచ్చే, వెళ్లే షిప్‌లను పరిశీలిస్తున్నారు. సముద్రంలో కేజీ బేసిన్ చమురు క్షేత్రాలు సమీపంలోకి ఎవరూ రాకుండా ముమ్మర గస్తీ నిర్వహిస్తున్నారు. సీకోస్టల్‌లో ఎక్కువగా కర్మాగారాలు, ఆయిల్ రిఫైనరీలు అధికంగా ఉన్న నేపథ్యంలో స్థానిక సెక్యూరిటీ విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు తీర ప్రాంతంలో పెట్రోలియం స్టోరేజ్ కేంద్రాలు, కర్మాగారాల్లో భద్రతా సిబ్బందిని జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తం చేసింది. ఐవోసీఎల్, బీపీసీఎల్,హెచ్‌పీసీఎల్ వంటి పెట్రోలియం స్టోరేజ్ కేంద్రాలు, కార్మాగారాల్లో ఇతరులను అనుమతించొద్దని భద్రత సిబ్బందికి హెచ్చరికలు జారీచేశారు. అలాగే బాంబ్ స్క్వాడ్స్, డ్రోన్ బృందాలు, కోస్ట్ గార్డ్స్, కేఎస్‌పీఎల్ సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు.

విమానాశ్రయంలో అణువణువు తనిఖీలు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక రక్షక దళం(ఏపీఎస్‌పీఎఫ్) అప్రమత్తమైంది.కమాండెంట్ కేఎస్ రావు స్వీయ పర్యవేక్షణలో భద్రత కట్టుదిట్టం చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరిలోని అన్నవరం దేవస్థానం, కాకినాడ రిలయన్స్‌ఓఎన్‌జీసీ రిగ్‌లు, యాంకరేజీ పోర్టు, రాజమండ్రి ఓఎన్‌జీసీ బేస్ పరిధిలోని కోనసీమ జిల్లాలోని కృష్ణా-గోదావరి బేసిన్ బావులు, రాజమహేంద్రవరం విమానాశ్రయం, బ్యాంకు చెస్ట్‌లకు ఏపీ ఎస్‌పీఎఫ్ సుమారు 800 మంది సుశిక్షితులైన పోలీసులతో భద్రత కల్పిస్తోంది. కోనసీమలోని గ్యాస్ పైపులైన్లను నిరంతరంగా పహారా కాస్తున్నారు. రాజమండ్రి ఎయిర్ పోర్టులో రెండంచెల భద్రత ఏర్పాటు చేశారు. వీవీఐపీ, వీఐపీ వంటి హోదాలతో సంబంధం లేకుండా ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అన్నిచోట్లా నిఘా ముమ్మరం చేశారు. మెటల్, లగేజీ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. సందర్శకులను ఇప్పటికే నిషేధించారు. రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో స్వీయ రక్షణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ), సిబ్బంది ఎప్పుడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే ఎలా స్పందించాలనే దానిపై అవగాహన కల్పించారు.



ఎస్.యానాంలో వేదాంత ప్లాంట్ వద్ద స్థానికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రశాంతకుమార్



కాకినాడలోని పెట్రోలియం స్టోరేజ్ కేంద్రాలు, కర్మాగారాల్లో భద్రత సిబ్బందిని అప్రమత్తం చేస్తున్న పోలీసులు

మేం సిద్ధంగా ఉన్నాం..



ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ఆయుధ సంపత్తితో సిద్ధంగా ఉన్నాం. పర్యవేక్షణ అధికారులు నిరంతరం విధుల్లోనే ఉంటున్నారు. సిబ్బందికి తరచుగా ఆయా ప్రదేశాల భద్రత, ప్రజల రక్షణపై సూచనలు చేస్తున్నాం. యుద్ధం మన వరకూ వచ్చినా ప్రాణాలొడ్డి పోరాడతాం.

- కేఎస్ రావు, కమాండెంట్, ఏపీఎస్‌పీఎఫ్

పవన్.. పెద్ద మనసు

- తన జీతం.. వారి జీవితాలకు..
- 42 మంది పిల్లలకు నెలకు రూ.5 వేల చొప్పున పంపిణీ
- ఆ వృద్ధురాలితో కలిసి భోజనం

నాకు దాచుకోవడం తెలియదు.. పంచిపెట్టడం తప్ప.. ఎన్నికలకు ముందు ఒక బహిరంగ సభలో పవన్ చెప్పిన మాట ఇది.. నిజమే ఆయనకు దాచుకోవడం తెలియదు.. అందుకే పేదలను చూస్తే కరిగిపోతారు.. పవర్ స్టార్ పవన్‌కల్యాణ్ ఇప్పుడు మరో మంచి పనికి శ్రీకారం చుట్టారు. డిప్యూటీ సీఎం పదవి ద్వారా ప్రతి నెలా వచ్చే జీతం మొత్తం పిఠాపురం నియోజకవర్గంలో తల్లిదండ్రులు లేని 42 మంది చిన్నారులకు రూ.5 వేలు చొప్పున పంపిణీ చేయాలని తలంచారు.. దీనిలో భాగంగా శుక్రవారం చిన్నారులను మంగళగిరి రప్పించుకుని రూ.5 వేల చొప్పున అందజేశారు.. వచ్చే నెల నుంచి ఇంటి వద్దే పంపిణీ చేస్తారని ప్రకటించారు.. తనపై అభిమానం పెంచుకున్న ఒక 95 ఏళ్ల వృద్ధురాలిని ఇంటికి తీసుకెళ్లారు.. నీకేం కావాలవ్వా అని అడిగారు. నీతో భోజనం చేయాలని ఉంది బాబూ అనగానే ఆమెతో కలిసి భోజనం చేశారు.. చీర పెట్టి, రూ.లక్ష ఇచ్చి కారులో ఇంటికి పంపారు.. - మెయిన్‌లో

గృహ నిర్మాణ లక్ష్యాలను సాధించండి!

ఇళ్ల నిర్మాణాల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష



కలెక్టరేట్ కార్యాలయంలో గృహ నిర్మాణ అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, మే9(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సొంత ఇంటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లతో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా చేపట్టిన గృహాల్లో 61 శాతం మాత్రమే పురోగతి సాధించారని, మరో రెండు వారాల్లో నిర్మాణాలను తుది దశకు చేరుకునేలా అధికారులు కృషిచేసి 80 శాతం ప్రగతి సాధించాలని కోరారు. పీఎం ఆవాస్‌యోజన, అర్బన్ హౌసింగ్ స్కీమ్ ద్వారా ప్రభుత్వం అందరికీ గృహనిర్మాణం అమలుచేస్తోందని, పట్టణ ప్రాంతాలు, మురికివాడల నివాసితులు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు ఇళ్లు ఏర్పాటుచేయడంలో ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. మధ్యలో నిలిచిపోయిన గృహాలను ప్రభుత్వం ప్రకటించిన అదనపు సాయంతో పూర్తిచేసి లక్ష్యాలు చేరుకోవాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. వ్యక్తిగత గృహనిర్మాణాలతోపాటు గ్రామీణ గృహనిర్మాణ కార్యక్రమాలను వేగవంతంగా అమలుచేయాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నివశిస్తున్న కుటుంబాలకు ప్రాథమిక సౌకర్యాలతో కూడిన పక్కా ఇంటిని నిర్మించాలని ఆదేశించారు. ఇంజనీర్లు పనితీరు మెరుగుపరుచుకోవాలని హెచ్చరించారు. సిబ్బంది కొరత ఉంటే సచివాలయ ఇంజనీర్లను నియమించుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, ఆ మేరకు ఇంజనీర్లను నియమిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షలో గృహనిర్మాణశాఖ పీడీ ఎంవీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భూముల మార్కెట్ విలువలపై అధ్యయనం

రామచంద్రపురంలోని అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం

అమలాపురం,మే9(ఆంధ్రజ్యోతి): మార్కెట్ విలువలకు సంబంధించి లోతైన విశ్లేషణ, నిర్దిష్టమైన ప్రతిపాదనలతో సిఫార్సులు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిలను ఆదేశించారు. రామచంద్రపురం పట్టణంలో భూముల మార్పిడి, భూముల విలువల నిర్ధారణ అంశాల పట్ల శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. విలువల నిర్ధారణ అంశాల పట్ల ఉత్పన్నమైన అభ్యంతరాలపై జోనల్ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్, ఆర్డీవో తదితర అధికారులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఈ సమీక్ష నిర్వహించారు. భూముల మార్కెట్ విలువలను అంచనా వేయడానికి, వాటిని ప్రభావితం చేసే అంశాలను గుర్తించడానికి, విలువలను సవరించడానికి సంబంధించిన వాస్తవాలతో తగిన సిఫార్సుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ భూమి, పట్టణ భూమి, పారిశ్రామిక ప్రాంతం, గనులు, తోటలు, వాణిజ్య వ్యవసాయేతర భూముల కోసం మార్కెట్ విలువలను రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు నిర్ణయిస్తారన్నారు. సమీక్షలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ జోనల్ అధికారి మాధవి, జిల్లా రిజిస్ట్రార్ జయలక్ష్మి, రామచంద్రపురం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లకు అరుంధతి నక్షత్ర దర్శనం

రూపాయలు పంపి.. లక్షలు లాగేసి.. 7

ఆశలపై నీళ్లు!



మండపేటలో వర్షంలో నానుతున్న ధాన్యం

జిల్లాలో వరి మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న వేళ.. అకాల వర్షాలు అన్నదాతలకు శాపంగా మారాయి. గత నాలుగైదు రోజులుగా రైతులను ఈ వానలు ముప్పుతిప్పలు పెడుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం కోనసీమ ప్రాంతంలోని పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. 12 గంటల నుంచి రెండు గంటల మధ్య కురిసిన ఈ వర్షానికి కల్లాల్లో, రోడ్ల పక్కన ఎండబెట్టిన ధాన్యం తడిసిపోయింది. అప్పటికప్పుడు పంట కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడినా కొన్నిచోట్ల నీట తడవక తప్పలేదు. ఈసారి పంటలు ఆశాజనకంగా ఉండడంతో రైతాంగం దిగుబడులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ అకాల వర్షం వారి ఆశలపై నీళ్లు చల్లినట్టయింది.



- జిల్లాలో భారీ వర్షం
- ఈదురుగాలుల బీభత్సం
- తడిసిన ధాన్యం
- ఆవేదన చెందుతున్న అన్నదాతలు



అలమూరులో తడిసిన ధాన్యం.. ఆత్రేయపురం మండలం లొల్లలో తడిసిన బస్తాలు

మండపేట/ఆలమూరు/ఆత్రేయపురం/అంబాజీపేట/అయినవిల్లి/రావులపాలెం, మే9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన వర్షానికి వరి మాసూళ్లకు తీవ్ర విఘాతం కలిగింది. ఇప్పటికే చాలావరకు మాసూలు పనులు పూర్తిచేసి కల్లాల్లో, రోడ్ల పక్కన రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోయింది. ఎక్కడికక్కడ ధాన్యం రాశులపై బరకాలు కప్పి జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ భారీ వర్షం కావడంతో ఆయాచోట్ల నీళ్లు నిలిచిపోయి పంట తడిసిపోయింది. మండపేట పరిసరాల్లో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ధాన్యం రాశుల చుట్టూ వర్షం నీరు నిలిచిపోయింది. ఉదయం ఎండకాయడంతో రైతులు పలుచోట్ల ధాన్యం ఆరబెట్టుకున్నారు. ఆకస్మికంగా మబ్బులు పట్టి వర్షం వచ్చేయడంతో ధాన్యం నీటిపాలైంది. తడిసిన ధాన్యం రంగుమారుతుందని.. సరైన ధర కూడా రాదని రైతులు వాపోతున్నారు. ఆలమూరు మండలంలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం కారణంగా ధాన్యం రాశులు తడిచిపోయాయి. బరకాలు గాలికి ఎగిరిపోవడంతోపాటు వర్షపునీరు రాశుల కిందకు రావడంతో ధాన్యం తడిసిపోయినట్టు రైతులు చెబుతున్నారు. ఆత్రేయపురంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రోడ్ల మీదే బరకాలు కప్పి ఉంచిన ధాన్యం తడిసిపోయింది. అంబాజీపేట మండలంలోనూ ఇదే పరిస్థితి. ఈ మండలంలో 75 శాతం వరికోతలు పూర్తికాగా, ధాన్యం ఆయా కల్లాల్లోనే రైతులు భద్రపరుచుకున్నారు. రోడ్లపైన ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది. అయినవిల్లి మండలంలో అకాల వర్షాలు అన్నదాతలకు కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. కోసిన పంటను ఆరబెట్టుకునే దశలో వర్షాలు పడి ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వాతావరణం నేపథ్యంలో బస్తా రూ.1725కు కొనుగోలు చేయాల్సి ఉండగా, ప్రైవేటు వ్యాపారులు రూ.1200కు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. రావులపాలెం మండలంలో దాళ్వా మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులను కలవరపెడుతున్నాయి. ఉదయం ఎండకాస్తుండగా, గత రెండు రోజుల నుంచి మధ్యాహ్నం 12 గంటల సమయం నుంచి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని కుండపోత వర్షం కురవడంతో రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోతోంది. ప్రభుత్వం తక్షణం తమ వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులంతా కోరుతున్నారు. లేదంటే అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఉద్యానవన పంటలకు మేలు చేస్తాయని ఆయా రైతులు చెబుతున్నారు.



ఆత్రేయపురం మండలం ర్యాలి రోడ్డులో విరిగిపడిన చెట్ల కొమ్మలు



రావులపాలెంలో ధాన్యం ఆరబెట్టుకున్న దృశ్యం

సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లకు...
అరుంధతి నక్షత్ర దర్శనం

● కోలాహలంగా గ్రామోత్సవం

● ఆకట్టుకున్న దేవతామూర్తుల వేషధారణలు

అన్నవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి వార్షిక దివ్య కల్యాణోత్సవాల్లో మూడో రోజైన శుక్రవారం నవ దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్ల అరుంధతి నక్షత్ర దర్శ నాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పు రాజగోపురం వద్దకు మేళతాళాలతో తోడ్కొని వచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం దాంపత్యజీవితానికి ప్రతీకలైన వశిష్ఠ, అరుంధతి నక్షత్రాలను చూపించి వారికి అర్ఘ్యం అర్పించారు. సాయంత్రం ఐదు గంటలకు దర్బారు మండపంలో ప్రధానార్చ కుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు ప్రధాన ప్రవేశ స్థాలీపాక హోమాలు నిర్వహించారు. వివాహం అనం తరం అమ్మవారు మెట్టినింటికి చేరుకుని అక్కడి నుంచి మరో జీవన ప్రయాణానికి నాంది పలికేందుకు ప్రతీకగా ఈ వేడుక జరిపారు. చతుర్వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. గ్రామోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలకు స్వామి,అమ్మవార్లను రావణబ్రహ్మ వాహనంపై ఆశీనులు గావించి విహరింపజేశారు. పలు సాంస్కృతిక ప్రదర్శనల నడుమ గ్రామోత్సవం కోలాహలంగా సాగింది. స్వామివారి వాహనసేవల్లో రావణ వాహన సేవకు అధిక ప్రాధాన్యం ఉండడంతో అన్నవరం, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి తిలకించారు. తప్పెటగుళ్లు, కోలాటం, వివిధ దేవతా మూర్తుల వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



రావణబ్రహ్మ వాహనంపై నూతన దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి గ్రామోత్సవం



నూతన దంపతులకు అరుంధతి నక్షత్రం చూపుతున్న రుత్వికులు





అన్నవరంలో సాంస్కృతిక కార్యక్రమాల దృశ్యాలు



విజయవాడలో భవనాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

రూ.1.30కోట్లతో రెడ్‌క్రాస్ భవనం

వర్చువల్ విధానంలో ప్రారంభించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

కార్పొరేషన్ (కాకినాడ), మే 9 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లా శాఖ రూ.1.30 కోట్లతో కాకినాడలో మూడు అంతస్తుల్లో శిశు సంరక్షణ, మహిళా సంక్షేమ, శిక్షణ కేంద్రాన్ని నిర్మించింది. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా విజయవాడ రాజ్‌భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో దీనిని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తన సతీమణితో కలిసి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, రెడ్‌క్రాస్ జిల్లా, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వైడీ రామారావు, భవన నిర్మాణ దాతలు డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి, ఓఎన్జీసీ చీఫ్ జనరల్ మేనేజరు జి.భాస్కర్‌రావు జెమినీ ఎడిబుల్ ఆయిల్స్ జనరల్ మేనేజరు ఎస్.గురుప్రసాద్, గవర్నర్ కార్యదర్శి హరి జనహర్‌లాల్, రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి ఏకే ఫరీదా, కోశాధికారి పి.రామచంద్రరాజు పాల్గొన్నారు. కింది అంతస్తులో శిశు గృహ ఏర్పాటు చేస్తున్నామని, మొదటి అంతస్తులో మహిళా శిక్షణ కేంద్రం, రెండో అంతస్తులో మహిళా అభ్యుదయ కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్, చైర్మన్ వైడీఆర్ గవర్నర్‌కు తెలిపారు. కాకినాడ శాఖ చేస్తున్న కార్యక్రమాలను గవర్నర్ ప్రశంసించి భవన నిర్మాణదాతలకు పుష్పగుచ్ఛాలిచ్చి సత్కరించారు.

వ్యాన్ ఢీకొని వృద్ధుడి మృతి



మృతిచెందిన సత్యనారాయణ

తాళ్లరేవు, మే 9 (ఆంధ్రజ్యోతి): టాటా ఏస్ గూడ్స్ వ్యాన్ ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం బ్రహ్మపురికి చెందిన మడికి సత్యనారాయణ (65) సుంకరపాలెం రోడ్డుపై వస్తుండగా వాహనం అదుపు తప్పి ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. కోరింగ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ఈ సంఘటనపై కోరింగ ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..



మృతిచెందిన నూకరాజు

కరప, మే 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన యర్రంనీడి సత్యనూకరాజు(69)కు మతిస్థిమితం సరిగాలేక అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లిపోయి మళ్లీ తిరిగి వచ్చేవాడు. అలాగే ఈ నెల 8వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతసేపటికీ తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం రోడ్డుపక్కన తలకు రక్తపుగాయంతో స్పృహ లేకుండా పడి ఉన్న నూకరాజును అదే గ్రామానికి చెందిన గణేష్ గుర్తించి అతడి కుమారుడికి సమాచారం అందించాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో చనిపోయినట్టు నిర్ధారించుకున్న కుటుంబసభ్యులు కరప పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ

కాకినాడ క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌లో కె.లేఖా నిహారిక ప్రతిభ కనబరిచి జూన్ 12 నుంచి 15వ తేదీ వరకు జరిగే 30వ హంగేరియన్ వాకో వరల్డ్ కప్‌కు ఎంపికైంది. కాకినాడకు చెందిన లేఖానిహారిక ఏప్రిల్ 21 నుంచి 30 వరకు కేరళలో జరిగిన అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ శిక్షణ శిబిరంలో ప్రతిభ చాటింది. శుక్రవారం ఆమెను కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ అభినందించారు. నిహారిక చూపిన పట్టుదల, కృషి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని.. జూన్‌లో జరిగే వరల్డ్ కప్‌లో ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.



నిహారికను అభినందిస్తున్న కాకనాడ ఎస్పీ

రూపాయలు పంపి.. లక్షలు లాగేసి!

- 'అమ్మ ఒడి' పేరుతో టోకరా
- అమరావతి నుంచి ఆఫీసరును మాట్లాడుతున్నానంటూ ఫోన్లు
- ఖాతాల నుంచి సొమ్ములు మాయం
- బాధితులందరిదీ పిఠాపురం నియోజకవర్గం

పిఠాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి నుంచి ఆఫీసరును మాట్లాడుతున్నాను. మాట్లాడేది పలానా వారేనా, మీకు గతంలో పనిచేసిన వాలంటీరు ఎలాంటి వారు.. మీకు గతేడాది అమ్మఒడి పడలేదు. ఈ ఏడాదితో కలిపి పడాలంటే నేను చెప్పినట్టు చేయండి అంటూ వాట్సాప్ షేరింగ్, ఫోన్ పేకు మొదట రూపాయి పంపి ఆపై ఓటీపీ చెప్పించుకుని బ్యాంకు ఖాతాలు నుంచి సొమ్ములు లా గేసి టోకరా వేశాడు ఒక వ్యక్తి. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో గురు, శుక్రవారాల్లో పలువురికి ఇదే విధమైన ఫోన్లు వచ్చి రూ.2లక్షలకు పైగా మోసపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పిఠాపురం పట్టణం, మండలంలోని గోకివాడ, విరవాడ తదితర గ్రామాలు, గొల్లప్రోలు పట్టణాలకు చెందిన పలువురు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్లు వచ్చాయి. అమరావతి నుంచి ఆఫీసరును మాట్లాడుతున్నానని పరిచయం చేసుకుని, తొలుత గతంలో పనిచేసిన వలంటీర్ల పనితీరు గురించి ఆరా తీశాడు. వారితో మాట్లాడుతూనే వలంటీర్లను లైన్‌లోకి తీసుకున్నాడు. ఆపై మీకు గతేడాది అమ్మఒడి రాలేదు మీ బ్యాంకు ఖాతాలో, ఆన్‌లైన్‌లో సమస్య ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడిందంటూ చెప్పారు. (గతేడాది ఎవ్వరికి అమ్మఒడి ని ప్రభుత్వం వేయలేదు). వచ్చే నెలలో మళ్లీ అమ్మఒడి పడుతుందని, మీ ఖాతాలకు రెండేళ్ల సొమ్ములు రూ.30వేలు రావాలంటే తాను చెప్పినట్టు చేయాలని సూచించాడు. ఇది నిజమేనని నమ్మి వాట్సాప్ షేరింగ్, ఫోన్ లింకింగ్ ఆప్షన్లకు ఓకే చెప్పారు. అదే సమయంలో ఫోన్లు చేసిన వారి ఫోన్‌పేకు లేకుంటే తెలిసిన వారి ఫోన్ పే ఖాతాలకు రూపాయి పంపాడు. ఇప్పుడు మీరు ఆ తర్వాత వచ్చే లింక్‌ను క్లిక్ చేసి ఓటీపీ చెప్పాలని కోరగా వారు చెప్పేశారు. ఈ విధంగా గోకివాడకు చెందిన రాంబాబు అనే వ్యక్తి ఖాతా నుంచి రూ.36వేలు, బాలాజీ నుంచి రూ.8వేలు, అంజి నుంచి రూ.5వేలతో పాటు సుమారు 24 మంది నుంచి రూ.2వేల నుంచి 40వేల వర కూ సుమారు రూ.2లక్షలకు పైగా సొమ్ములను బ్యాంకు ఖాతాలు నుంచి లాగేశాడు. ఖాతాలు నుంచి సొమ్ములు మాయం కావడంతో మోసపోయామని గుర్తించిన వారు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఆ వ్యక్తి నేరుగా అమ్మఒడి లబ్ధిదారులకే ఫోన్ చేయడం, అదే సమయంలో వలంటీర్లకు ఫోన్లు కలపడం వంటివి చేయడంతో ఇతను గత ప్రభుత్వంలో పనిచేసి ఈ వివరాలను తీసుకుని ఇప్పుడు ఫోన్ చేసి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ వ్యవహారం పిఠాపురం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారడంతో పాటు జనసేన పార్టీ తరపున ఇటువంటి ఫోన్లకు ఎవ్వరు స్పందించవద్దంటూ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం సాగిస్తున్నారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన



పెద్దాపురంలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు



నాగమల్లిక మృతదేహం

పెద్దాపురం/గండేపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సురంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న నిండుకుండల నాగమల్లిక (23) శుక్రవారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకుంది. గండేపల్లి పోలీసుల వివరాల ప్రకారం.. రౌతులపూడి మండలం మెరకచామవరం గ్రామానికి చెందిన నాగమల్లిక యూనివర్సిటీలో వార్డెన్‌గా పనిచేస్తుంది. అదే గ్రామానికి చెందిన శెట్టిబత్తుల శివదుర్గ, ఆమె ప్రేమించుకున్నారు. కానీ శివ దుర్గ వివాహం చేసుకోవడానికి నిరాకరించినందున ఆమె మనస్తాపం చెంది తాను ఉంటున్న రూమ్‌లోనే సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని మరణించిందని నాగమల్లిక తల్లి అయిన దేవుడమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శివనాగబాబు పేర్కొన్నారు. యూనివర్సిటీ యాజమాన్యం నాగమల్లిక మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రి తరలించడంతో మృతురాలి బంధువులు, దళిత సంఘాల నాయకులు అక్కడికి చేరుకుని రహదారిపై బైఠాయించారు. నాగమల్లిక మృతిపై తమకు పలు అనుమానాలు ఉన్నాయని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుని ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు. నాగమల్లిక మృతితో ఎమ్.చామవరంలో విషాదచాయలు అలుముకున్నాయి. నిండుకుండల రమణమ్మ, దేవుడమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు కాగా నాగమల్లిక మూడో అమ్మాయి. అక్కలిద్దరికీ పెళ్లిళ్లు చేయగా నాగమల్లిక వార్డెన్‌గా పనిచేస్తుంది. ఆమె కుటుంబం వలస కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. మూడు నెలలు క్రితం కాకినాడ వలస వెళ్లారు.

జయలక్ష్మి కో-ఆపరేటివ్ సొసైటీ నిందితుల ఆస్తుల జప్తు

సుమారు రూ.7.10 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి జీవోలు జారీ

సర్పవరం జంక్షన్, మే 9 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీల ఆశ చూపించి కోట్లాది డిపాజిట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ నిందితుల ఆస్తులను అటాచ్‌మెంట్ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం రెండు జీవోలు విడుదల చేసింది. దీంతో ఇప్పటివరకు ప్రభుత్వం 14 జీవోలు జారీ చేసినట్టు అయింది. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో 1999లో ప్రధాన కార్యాలయంగా జయలక్ష్మి మ్యూచువల్లీ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీని చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, వైస్ చైర్‌పర్సన్‌గా బదిరీ విశాలాక్షి తదితర డైరెక్టర్లతో ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖ, కృష్ణా జిల్లాల్లో 29 బ్రాంచీలతో సుమారు 19 వేలమంది నుంచి సుమారు రూ.4580 కోట్లు డిపాజిట్లు సేకరించారు. బాండ్ల కాలపరిమితి దాటినా డబ్బులు చెల్లించకపోవడంతో బాధితులు ఆందోళనచేపట్టగా, 6 ఏప్రిల్ 2022న సొసైటీ చైర్మన్,వైస్ చైర్మన్, డైరెక్టర్లు బోర్డు తిప్పేసి పరారయ్యారు. ఆర్థికమోసానికి పాల్పడిన జయలక్ష్మి పాలకవర్గం సభ్యులను అరెస్ట్ చేసి న్యాయం చేయాలని బాధితులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం సహకార శాఖ ద్వారా ఈ కేసును సీబీసీఐడీకి అప్పగించింది. డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం జప్తు చేసిన ఆస్తులపై నియంత్రణను అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ కుంభకోణానికి ప్రధాన సూత్రధారులైన జయలక్ష్మి సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్లు ఇతర డైరెక్టర్లపై కేసు నమోదు చేసిన సీబీసీఐడీ అధికారులు అరెస్ట్ చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితులకు చెందిన ఆస్తుల స్వాధీనానికి ప్రభుత్వం వేర్వేరుగా 12 జీవోలను జారీ చేసింది. సుమారు 98 ఆస్తులకు చెందిన రూ.450 కోట్ల విలువైన స్థిరాస్తులను సొసైటీ చొరవతో సీఐడీ సీజ్ చేసి కోర్టుకు అటాచ్‌మెంట్ చేసింది. శుక్రవారం నిందితుల ఆస్తులను అటాచ్‌మెంట్ చేస్తూ మరో రెండు జీవోలు విడుదల చేసింది. ఇందులో విశాఖపట్నం చంద్రంపాలెంకు చెందిన చుండూరి శివసూర్యవెంకటశ్రీనివాస్ పేరుపై శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల మండలం ధర్మవరం, అనకాపల్లి జిల్లా చోడవరం, కాకినాడ రూరల్ మండలం చీడిగ, తిమ్మాపురం, కొత్తపల్లి మండలం కొమరగిరి, పొన్నాడ, పిఠాపురం, కొత్తపల్లి, సామర్లకోట మండలం కొప్పవరం, కాకినాడ అర్బన్ రామారావుపేట, మెహర్‌నగర్ వలు ప్రాంతాల్లో ఉన్న సుమారు రూ.7.10 కోట్ల ఖరీదు చేసే పలు ప్లాట్లు, స్థిరాస్తులను సీజ్ చేస్తూ ప్రభుత్వం 77 పేరుతో జీవో జారీ చేసింది. అలాగే జీవో నెం.78 పేరుతో నిందితుల నుంచి అటాచ్‌మెంట్ చేసిన ఆస్తులపై స్వాధీనం కోసం, నియంత్రణ చేస్తూ సంబంధిత కోర్టు ముందు దరఖాస్తు దాఖలుచేసేందుకు ఏపీ మంగళగిరి నేర పరిశోధనా విభాగం డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌కి అధికారం అప్పగిస్తూ తదుపరి చర్యలు తీసుకోవాలని, అనంతరం నివేదికను ప్రభుత్వానికి పంపాలని ఆదేశాలు జారీ చేస్తూ 78పేరుతో జీవో జారీ చేసింది. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆస్తుల స్వాధీనం, సేల్ ఆర్డర్ కోసం సత్వరమే ప్రభుత్వ, న్యాయపరమైన అనుమతులు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. మరో మూడు జీవోలను కూడా సత్వరమే విడుదల చేసి, తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని వారు కోరుతున్నారు.

35,94,774 విద్యార్థిమిత్ర కిట్లు సిద్ధం

రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్ గని

ఉప్పలగుప్తం, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు 35,94,774 డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు సిద్ధంగా ఉన్నట్టు రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్‌గని తెలిపారు. కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ఆయన కిట్లు పంపిణీకి నియమించిన బృందాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిట్లు పంపిణీ, కిట్లలోని ఎనిమిది యూనిట్లపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత పాఠశాలల వరకు విద్యార్థులకు పుస్తకాలు బరువు తగ్గించే ప్రణాళిక అమలు చేస్తున్నట్టు వివరించారు. ఆరో తరగతికి హిందీ పుస్తకం ఉండదన్నారు. 6,7 తరగతులకు లాంగ్వేజస్ ఒక పుస్తకం, నాన్‌లాంగ్వేజస్ విడివిడిగా ఉంటాయన్నారు. 1,2 తరగతులకు తెలుగు, ఇంగ్లీషు, గణితం కలిపి ఒకే పుస్తకం ఉంటుందన్నారు. విద్యార్థిమిత్ర జిల్లా పరిశీలకుడు బీవీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాలో 97,078 విద్యార్థిమిత్ర కిట్లు పంపిణీ చేస్తామన్నారు. ఏకరూప దుస్తుల కోసం వస్త్రం సరఫరా చేసి, ప్రతి జతకు కుట్టుకూలిగా రూ.200 తల్లుల ఖాతాలో జమచేస్తామన్నారు. ఎంఈవోలు కె.కిరణ్‌బాబు,సత్తి సత్యకృష్ణ పాల్గొన్నారు.

మావోయిస్టుల మృతదేహాల అప్పగింత

రంపచోడవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం శేషసాయి అటవీ ప్రాంతంలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు స్పెషల్ జోనల్ కమాండర్ జగన్, డిస్ట్రిక్ కమాండర్ రమేష్ మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాలను వారి బంధువులకు పోలీసులు అప్పగించారు.

ఆలిండియా సీఎస్ఎస్ఆర్ కాంపిటేషన్‌లో
కాకినాడ ఏపీఎస్పీ సిబ్బందికి తృతీయం



సిబ్బంది నల్లబాబు, శివశంకర్‌లను అభినందిస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

సర్పవరం జంక్షన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన కొలాప్స్‌డ్ స్ట్రక్చర్ సెర్చ్ అండ్ రెస్క్యూ (సీఎస్ఎస్ఆర్) కాంపిటేషన్‌లో కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ఎస్‌డీఆర్ఎఫ్ టీమ్ తృతీయ స్థానంలో నిలిచింది. శుక్రవారం కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఎస్పీలో నిర్వహించిన అభినందన సభలో ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పి.నల్లబాబు, శివశంకర్‌లను కమాండెంట్ ముద్రగడ నాగేంద్రరావు అభినందించారు. రూ.50వేలు నగదు, మెడల్స్ అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో జరిగే పోటీల్లో మరింత ప్రతిభ చూపి ఏపీఎస్పీ బెటాలియన్‌కు పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిలంకలో చోరీ

55 గ్రాముల బంగారం, 39 తులాల వెండి మాయం



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్, పోలీసులు

ముమ్మిడివరం, మే 9 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి వెండి, బంగారు వస్తువులు అపహరించుకుపోయారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అన్నంపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిలంకలో చోరీ జరిగింది. లక్ష్మీదేవిలంకకు చెందిన కడలి పద్మావతి బుధవారం సామర్లకోటలోని బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. అయితే బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న పద్మావతి మరిది హేమరాజు శుక్రవారం పద్మావతి ఇంటి వద్ద పెట్టిన మోటారుసైకిల్‌ను తీసుకునేందుకు వెళ్లగా తలుపుల తాళాలు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి పద్మావతికి ఫోన్ చేశాడు. ఇంటి వెనుకకు వెళ్లిచూడగా తలుపులు పెకిలించి ఉండడం, బీరువా తాళాలు తీసి ఉండడంతో విషయాన్ని పద్మావతికి చెప్పడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. బీరువాలో ఉంచిన 55 గ్రాముల బంగారపు వస్తువులు, 39తులాల వెండి వస్తువులు, రూ.20వేల నగదును దొంగలు అపహరించుకుపోయినట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. పద్మావతి భర్త ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉండగా పద్మావతి తల్లి, కుమారుడు, అక్క కుమార్తె ఇంట్లో ఉంటున్నారు. ప్రస్తుతం వారంతా బంధువుల ఇంటికి ఊరు వెళ్లిన సమయంలో చోరీ జరిగింది. సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి వెళ్లి చోరీకి సంబంధించిన ఆధారాలు సేకరించారు. క్లూస్‌టీం బృందం వచ్చి ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేపట్టారు.

అల్లుకుంది ఆపద!

కాకినాడలోని కొండయ్యపాలెం బ్రిడ్జి వద్ద అపార్టమెంట్ల సమీపంలో విద్యుత్ స్తంభానికి ఓ మొక్క అల్లుకుంది. అయితే వర్షాలు కురిస్తే విద్యుత్ ప్రమాదం సంభవించే అవకాశం లేకపోలేదు.

- ఫొటోగ్రాఫర్, కాకినాడ







వసంతకాల వేళ.. అదిరేల

వసంతకాలం వచ్చిందంటే చెట్లు చిగురిస్తాయి, పుష్పాలు విచ్చుకుని ఆహ్లాదాన్ని ఆనందాన్ని పంచుతాయి. రాజమహేంద్రవరం టీనగర్ లో గోదావరి బండ్ వైపు రేల చెట్లు పుష్పించాయి. చూడముచ్చటగా పసుపు పందిరి మాదిరిగా కనిపిస్తున్నాయి. అటుగా వెళ్లేవారిని ఆకర్షిస్తున్నాయి.

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

ట్రాక్టర్లు ప్రారంభం

ఆలమూరు, మే 9(ఆంధ్రజ్యోతి): పెదపళ్ల, పినపళ్ల గ్రామాల్లోని చెత్తను తరలింపునకు ఓఎన్జీసీ అందించిన ట్రాక్టర్లను శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతనుదాస్ ప్రారంభించారు. పంచాయతీల్లో చెత్త తరలింపునకు ట్రాక్టర్లు ఏర్పాటుచేసిన ఓఎన్జీసీ అధికారులను ఎమ్మెల్యే అభినందించారు.

వెంకన్న ఆదాయం రూ.3.34లక్షలు

ఆత్రేయపురం, మే 9(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఆదాయం రూ.3,34,012 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఆడ పిల్లలకు చదువే ఆస్తి



కిశోర వికాసం సభలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి

ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి

మలికిపురం, మే 9(ఆంధ్రజ్యోతి): ఆడ పిల్లలకు చదువే ఆస్తి అని ఐసీడీఎస్ పీడీ వి.శాంతకుమారి అన్నారు. మలికిపురం పూలే-అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన కిశోర వికాసం సభలో శాంతకుమారి మాట్లాడుతూ బాల్య దశలో వివాహాలు చేస్తే పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే మహిళా శిశు సంక్షేమశాఖకు చెందిన టోల్‌ఫ్రీ నంబరు 1098ని సంప్రదించాలని కోరారు. రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి, సూపర్‌వైజర్ కె.చంద్రకళ, హైమావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, స్వాతి, డి.సుజాత, జ్ఞానేశ్వరి, చంద్ర, మహిళా పోలీసులు పాల్గొన్నారు. జి.పల్లిపాలెంలో జరిగిన కిశోర వికాసం కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రసన్నరాణి బాలల హక్కులు, బాల్య వివాహాల వల్ల నష్టాలు తదితర అంశాలపై మాట్లాడారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

వేసవిలో వికాస శిక్షణా తరగతులు

మలికిపురం, మే 9(ఆంధ్రజ్యోతి): వేసవిలో కిశోర బాలికల్లో అవగాహన కల్పించడానికి జిల్లాలో ఈనెల10 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఐసీడీఎస్ పీడీ వి.శాంతకుమారి అన్నారు. శుక్రవారం మలికిపురంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 1726 అంగన్‌వాడీ కేంద్రాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కార్యకలాపాలు సక్రమంగా జరగడానికి తరచూ సూపర్‌వైజర్లతో కేంద్రాలను తనిఖీ చేయిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ విద్య అమలులో పలు మార్పులు వచ్చాయని, ఇంగ్లీషు, తెలుగు మీడియంలలో శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లాలో పది బాల్య వివాహాలను నిలిపి వేసినట్టు శాంతకుమారి తెలిపారు. త్వరలో కార్యకర్తలకు ఆధునిక, సాంకేతికతతో కూడిన సెల్‌ఫోన్లను ఇవ్వనున్నామన్నారు. సీడీపీవో రమాదేవి, పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నేరం

అంతర్వేది, మే 9(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి అన్నారు. శుక్రవారం మోరి గ్రామంలో కిశోరి వికాస కార్యక్రమానికి పీడీ శాంతకుమారి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పునరుత్పత్తి, ఆరోగ్యం, బాల్యవివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. కిశోరి బాలికలందరినీ సమావేశంలో కలిసి పౌష్టికాహార లోపాల గురించి ఆరా తీశారు. మోరి, మోరిపోడు గ్రామాల్లో కిశోరి బాలికల అవగాహన కార్యక్రమాలను ఆమె పర్యవేక్షించారు. కార్యక్రమంలో సీడీపీవో వైకేడీ రమాదేవి, సూపర్‌వైజర్ చంద్రకళ, సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగాత్రివేణి, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది తీరంలో ఇసుక దొంగలు

- రాత్రి వేళల్లోనే అక్రమంగా ఇసుక తరలింపు
- ఇసుక తీయగా ఏర్పడిన గుంతలను పూడ్చేస్తున్న కెరటాలు



అంతర్వేది సముద్ర తీరంలో కెరటాల వద్ద రాత్రి అక్రమంగా ఇసుక తరలించిన ప్రదేశం



అంతర్వేది సముద్రతీరంలో గట్టుకు మట్టిని తరలించిన తరువాత ఏర్పడిన గుంటలు

అంతర్వేది, మే 9(ఆంధ్రజ్యోతి): అంతర్వేది సముద్ర తీరంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రాత్రి సమయాల్లోనే ఇసుకను తరలిసున్నారు. తీర ప్రాంత గ్రామాలు ముంపునకు గురికాకుండా అడ్డుకట్ట వేసిన గట్టును తీసి కెరటాల వద్దనున్న మట్టిని అక్రమంగా మిషన్ల సాయంతో గట్టు ఇవతలకు తరలిస్తున్నారు. కెరటాలు వద్ద ఇసుక తీయగా ఏర్పడ్డ గుంటలు మరుసటి రోజుకు పూడుకుపోతున్నాయి. ఇదేఅదునుగా పసిగట్టిన ఇసుక అక్రమ రవాణాదారులు గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రి వేళల్లో అక్రమ దందా యథేచ్ఛగా కొనాగిస్తున్నారు. ఐదు నుంచి పది అడుగుల లోతున సముద్ర కెరటాల వద్ద ఇసుకను వెలికి తీస్తుంటే రెండు రోజుల్లోపు కెరటాలకు ఇసుక చేరి గుంతలు పూడ్చేయడంతో ఎవరికీ అనుమానాలు రావడం లేదు. రాత్రుళ్లు ఇసుకను గట్టు ఇవతల తరలించుకుని ఒకేసారి ట్రాక్టర్లతో వారి అనుకూల ప్రదేశాలకు తరలించుకుపోతున్నారు. గతంలో కొండల మాదిరిగా ఉన్న ఇసుక తిన్నెలను ఇష్టానుసారంగా తవ్వుకుంటూ నేలమట్టానికి ఇసుక అక్రమ దందా నడిచింది. ప్రస్తుతం సముద్రపు పోటు నీరు రాకుండా గట్టు వేయడంతో నీరు ముందుకు రాకపోవడంతో తీర ప్రాంతంలో ఎక్కడైనా ట్రాక్టర్లు, మిషన్లు తిరిగేందుకు అనుకూలంగా ఉండడంతో కొత్తకొత్త దారులు ఏర్పాటుచేసుకుని తీరప్రాంత ఇసుకను సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. డ్రెడ్జింగ్ హార్బరు నిర్మాణం చేస్తారని ప్రభుత్వాలు ప్రచారం చేయడంతో ఎక్కడ ఇసుక దొరకకుండా పోతుందోనని పూర్వం నుంచి రైతులు కూడా ఇసుకను తరలించారు. మళ్లీ డ్రెడ్జింగ్ హార్బరు యూనివర్శిటీ శంకుస్థాపనకు రెవెన్యూ యంత్రాంగం సర్వేలు నిర్వహించడంతో ఇసుక అక్రమ రవాణాదారులు ముందస్తుగా అక్రమంగా మట్టిని తరలించి దోచుకుని దాచుకుంటున్నారు. తీర ప్రాంతాన్ని గుల్ల చేస్తూ పర్యావరణంలో వచ్చిన మార్పులకు ఇప్పటికే సరుగుడు, కొబ్బరి తోటలు నేలకొరిగాయి. తాడిచెట్లు తలలు లేకుండా బోసిబోయాయి. ఇసుక గుట్టలతో కొండలు మాదిరిగా ఉన్న తీర ప్రాంతం ఖాళీ ప్రదేశాలై పల్లపు ప్రాంతాలుగా మారాయి. కడలి ఆగ్రహానికి గురైతే తీరప్రాంతంలో భయంకరమైన ఉపద్రవాలు వచ్చే అవకాశం ఉందేమోనని గ్రామస్తులు వాపోతున్నారు. రెవెన్యూ యంత్రానికి కూడా అంతుచిక్కని ఇసుక అక్రమ రవాణా గ్రామస్తులు, అధికారులను మభ్యపెట్టి రాత్రి సమయంలోనే ఇసుక దందాలు కొనసా గించి తీర ప్రాంతాన్ని గుల్ల చేస్తున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు దృష్టి సారించినట్లయితే ఇసుక అక్రమ దందాకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవచ్చునని గ్రామస్తులు వాపోతున్నారు.

ప్రతీ కార్యకర్తకు అండగా జనసేన



ఐడీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, మే 9(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలో సభ్యత్వం పొందిన ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో క్రియాశీలక సభ్యులకు శుక్రవారం కిట్లను అందించి అనంతరం మాట్లాడారు. పార్టీకి సేవ చేసిన ప్రతి కార్యకర్తకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. సభ్యత్వం పొందిన క్రియాశీలక సభ్యులు ప్రమాదానికి గురైతే రూ.5లక్షల బీమా వర్తిస్తుందన్నారు. అనంతరం 113మంది క్రియాశీల వలంటీర్లకు 18,184 సభ్యత్వ ఐడీ కార్డులను ఆయన అందించారు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి విచ్చేసిన శ్రీఅక్షయను ఎమ్మెల్యే దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, జాలెం శ్రీనివాసరాజా, ఆదిమూలం సూరయ్యకాపు, యడ్ల ఏసు, తాటికాయల శ్రీనివాసరావు, పాలూరి ఫణి, తాటికాయల వెంకటేష్ పాల్గొన్నారు.

అధ్వానంగా ఆర్అండ్‌బీ రోడ్డు



అయినవిల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం నుంచి కె.జగన్నాథపురం వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు నిలువెత్తు గోతులతో ప్రమాద భరితంగా మారింది. వర్షం వస్తే గోతులన్నీ నీటితో నిండిపోయి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. రావులపాలెం, ముమ్మిడివరం జాతీయ రహదారులను కలిపే స్టేట్ హైవే రోడ్డు దుస్థితిపై అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. రావులపాలెం నుంచి మురమళ్ల వెళ్లే ఆర్టీసీ బస్సులు, కాకినాడ-రావులపాలెం బస్సులు, నిత్యం భారీ రవాణా వాహనాలు ఈరోడ్డు మార్గానే పయనించాల్సి ఉంది. భారీ వాహనాలు గోతుల్లో పడి ఎక్కడ తల కిందులు అవుతాయోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు సైతం గోతుల్లో పడి దెబ్బతింటున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు జలమయం కావడంతో ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈరోడ్డుపై ప్రయాణం నరకయాతనగా మారడంతో సమీపంలోని కాల్వగట్టు సింగిల్ రోడ్డును స్థానికులు ఆశ్రయిస్తున్నారు. ఐదేళ్ల క్రితం టెండరు పిలిచినా పనులు ప్రారంభించకపోవడంపై ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఆర్అండ్‌బీ రోడ్డుకు మోక్షం కల్పించాలని, తక్షణం గోతులు పూడ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నారు.



పశువుల శాలగా.. కమ్యూనిటీహాలు!





కమ్యూనిటీ హాలులో పశువులు, సన్నవిల్లి కాలనీలో శిథిలావస్థకు చేరుకున్న కమ్యూనిటీ హాలు

ఉప్పలగుప్తం, మే 9(ఆంధ్రజ్యోతి): సన్నవిల్లి కాలనీలో నిర్మించిన కమ్యూనిటీహాలు శిథిల స్థితికి చేరుతోంది. 2006లో నిర్మించిన ఈకమ్యూనిటీ హాలును పాలకులు గాలికొదిలేశారు. నేడు పశువుల నిలయంగా కమ్యూనిటీ హాలు రూపు మార్చుకుంది. మూడు దశాబ్దాల క్రితం సన్నవిల్లి శివారులో నిరుపేదలకు గృహాలు నిర్మించేందుకు సుమారు మూడెకరాల స్థలం కేటాయించారు. ఈకాలనీలో 108మందికి ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చారు. నీటి వసతి లేక గృహాలు నిర్మించుకునేందుకు పలువురు వెనకాడుతూ వచ్చారు. అనర్హులకు పట్టాలు ఇవ్వడంతో వారు ఇక్కడకు వచ్చే అవసరం లేనందున ఇళ్లు కట్టుకోలేదు. అప్పట్లో టీడీపీప్రభుత్వం మొత్తం స్థలాన్ని మెరక చేయించింది. కాగా 2006లో ఎంపీ నిధులతో ఈకాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మించారు. ఈభవనం ద్వారాలకు, కిటికీలకు తలుపులు ఏర్పాటు చేయలేదు. భవనానికి ప్లాస్టింగ్ కూడా చేయలేదు. దీనితో కమ్యూనిటీ భవనం క్రమంగా శిథిలస్థితికి చేరింది. ఈకాలనీలో కేవలం సగం మంది మాత్రమే ప్రస్తుతం గృహాలు నిర్మించుకున్నారు. ఇటీవల కాలనీకి సీసీ రహదారులు నిర్మించారు. విద్యుత్ సౌకర్యం కల్పించారు. కాలనీలోని కమ్యూనిటీ హాలును మాత్రం పాలకులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఫలితంగా ఈభవనం ప్రస్తుతం పశువులశాలగా మారింది. భవనం పరిసరాలు పశువుల వ్యర్థాలతో దుర్వాసన వ్యాపిస్తోంది. వర్షాకాలంలో పరిసర కుటుంబాలు ఈవ్యర్థాల కంపుతో ఇబ్బందులు పడుతున్నారు. ఈభవనాన్ని ఆధునీకీకరించి ఇబ్బందులు లేకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సముద్ర తీర ప్రాంతంలో ప్రత్యేక నిఘా

మాక్ డ్రిల్, రక్షణ చర్యలపై అవగాహన



అల్లవరం: ఓడలరేవులో ఓఎన్జీసీ, ఎస్పీఎఫ్, మెరైన్ పోలీసుల మాక్ డ్రిల్ దృశ్యం



ఉప్పలగుప్తం: రవ్వ ప్లాంటు పరిసర ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు, మెరైన్, రవ్వ ప్లాంటు భద్రతా సిబ్బంది, అధికారులు

అల్లవరం, మే 9(ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధం నేపథ్యంలో బాంబు దాడులు జరిగితే తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ఓడలరేవులో ఓఎన్జీసీ, ఎస్పీఎఫ్, మెరైన్, సివిల్, రెవెన్యూ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. తీరంలో యుద్ధం సంభవిస్తే తీసుకోవాల్సిన రక్షణ చర్యలు, జాగ్రత్తలపై ఎస్పీఎఫ్ సీఐ పెండ్యాల రంజిత్‌కుమార్, మెరైన్ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు టి.తిరుమలరావు, చినబాబు, శ్రీనివాస్, సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ, ఉమామహేశ్వరరావు, కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, ఆర్ఐ కోడూరి మన్యం, వీఆర్వో మెట్ల బాబ్జి, మెడికల్, అగ్నిమాపక సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.యానాంలో ప్రత్యేక నిఘా

ఉప్పలగుప్తం, మే 9(ఆంధ్రజ్యోతి): భారత్-పాక్ యుద్ధవాతావరణ నేపథ్యంలో కేజీ బేసిన్ పరిధిలో కీలక చమురు క్షేత్రం ఎస్.యానాం రవ్వ ప్లాంటు వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. మూడు రోజులుగా ప్లాంటులో పోలీసులు, మెరైన్ సిబ్బంది, రవ్వ భద్రతా సిబ్బంది ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ జరుగుతోంది. శుక్రవారం ఎస్.యానాం గ్రామంలో ప్రజలకు భద్రతా అంశాలపై అవగాహన కల్పించారు. రవ్వ ప్లాంటులో భద్రతను లెవెల్-1 నుంచి లెవెల్-2కు పెంచినట్టు ప్లాంటు ప్రతినిధి తెలిపారు. మాక్ డ్రిల్ అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు, ఇతర శాఖల సమన్వయంతో చేపట్టే చర్యలను వివరించారు.ఉప్పలగుప్తం ఎస్ఐ సీహెచ్ రాజేష్ తో పాటు మెరైన్ సీఐ, రవ్వ భద్రతాధికారులు పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితులపై అవగాహన

మామిడికుదురు, మే 9(ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ యుద్ధ వాతావరణం నేపథ్యంలో నగరంలోని జీసీఎస్ వద్ద ఓఎన్జీసీ ఆధ్వర్యంలో శుక్రవారం మాక్ డ్రిల్ జరిగింది. ఓఎన్జీసీ అధికారులు విపత్కర పరిస్థితులు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓఎన్జీసీపై ఉగ్రవాదులు బాంబు దాడులకు పాల్పడితే ఏవిధంగా వాటిని తిప్పికొడతామో కళ్లకు కట్టినట్టు చేసి చూపించారు. ఓఎన్జీసీ అధికారి రుషికేశ్‌రెడ్డి, నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్, ఆర్ఐ ఇబ్రహీం, సర్పంచ్ జాలెం రమణకుమారి, స్థానిక నాయకులు జాలెం సుబ్బారావు, హుస్సేన్, కోళ్ల సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి వీవీఎస్వీ ప్రసాద్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తీరంలో మాక్‌డ్రిల్

అంతర్వేది, మే 9(ఆంధ్రజ్యోతి): అంతర్వేది తీర ప్రాంతంలో మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు.భారత్-పాకిస్థాన్ యుద్ధ నేపథ్యంలో సముద్ర తీరంలోగస్తీ చర్యలు చేపట్టారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు తెలపాలన్నారు. అంతర్వేది నుంచి సముద్ర తీరమంతా గస్తీ నిర్వహిస్తున్నట్టు మెరైన్ సీఐ నవీన్‌నరసింహమూర్తి తెలిపారు.

ఆర్మీకి మేలు జరగాలని ప్రత్యేక పూజలు



రాజోలు, మే 9(ఆంధ్రజ్యోతి): రాజోలు శ్రీఆంజనేయస్వామివారి దేవాలయంలో దేశ జవాన్లకు, భారత ఆర్మీకి మేలు జరగాలని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి అనుగ్రహం దేశానికి, జవాన్లకు ఉండాలని ఆకాంక్షించారు. భారత్‌మాతాకీ జై అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాజోలు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కాసు భవానీ, కొత్త పద్మావతి, రాజా నాగరత్నకుమార్, కాసు రాణి, గెల్లి అన్నపూర్ణ, కొత్తపల్లి పుష్కర, గాదే బుజ్జి, కొప్పిశెట్టి వెంకి, రాజా సూర్య తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తిచేసుకున్న డ్రైవర్లకు సర్టిఫికెట్ల పంపిణీ



డ్రైవర్లకు సర్టిఫికెట్లు అందిస్తున్న డీటీవో శ్రీనివాస్, ఆర్టీసీ మేనేజర్ తదితరులు

అమలాపురం టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలో హెవీ డ్రైవింగ్ స్కూలులో 32రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న పదో బ్యాచ్‌లోని 16మంది అభ్యర్థులకు శుక్రవారం సర్టిఫికెట్లను అందజేశారు. జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్టీపీ రాఘవకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీటీవో డి.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఆర్టీసీ శిక్షణా కళాశాలను ఎంపిక చేసుకున్నందుకు అభ్యర్థులను అభినందించారు. డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు మెయింటినెన్స్‌పై అవగాహన కల్పించామని, జూన్ నెల రెండో వారంలో 11వ బ్యాచ్ శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని వారు తెలిపారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏఈ మెకానికల్ జీఆర్ఎల్ దేవి, ప్రతిమాకుమారి, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) రామారావు, సెక్యూరిటీ ఎస్ఐ వరహాలబాబు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయం తొలగింపుపై విచారణ

అల్లవరం, మే 9(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని సమాచారం లేకుండా కొందరు ఏకపక్షంగా తొలగించ తమ మనోభావాలను దెబ్బతీశారంటూ గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుపై తహశీల్దార్ బీవీఎల్ నరసింహం, ఎస్ఐ టి.తిరుమలరావులు సమావేశం జరిపి విచారణ చేపట్టారు. గ్రామదేవత ఆలయం తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో భైరిశెట్టి రామారావు, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, కడలి శ్రీనివాసరావు, పితాని సత్యనారాయణ, బొంతు సత్యనారాయణ, కడలి దేవిప్రసాద్, కట్టా సూర్యనారాయణ, గెద్దాడ జాన్‌తాతారావు, కుడుపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివార్ల కల్యాణం

మామిడికుదురు, మే 9(ఆంధ్రజ్యోతి): ఈదరాడ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ ఉమాసోమేశ్వరస్వామి, శ్రీలక్ష్మీనరసింహస్వామివార్ల కల్యాణాలను శుక్రవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కల్యాణ ఘట్టాన్ని అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా చేశారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని వీక్షించి స్వామి-అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రావులపాలెం, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్ వేదికగా వచ్చే సమస్యలను తెలుసుకుని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపుపార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. ఈవినతులను ఆయ శాఖల అధికారులకు పంపి వాటి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

లోవోల్టేజీతో వినియోగదారులకు అగచాట్లు

ఉప్పలగుప్తం, మే 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లోవోల్టేజీతో మండల వ్యాప్తంగా వినియోగదారులు అగచాట్లు పడుతున్నారు. ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 5గంటల వరకు లోవోల్టేజీ కొనసాగుతోంది. ఉప్పలగుప్తం, టి.చల్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్లకు సంబంధించి కొన్ని ఫీడర్ల పరిధిలో లోవోల్టేజీ సమస్య అధికంగా ఉండటంతో వినియోగదారులు ట్రాన్స్ కో అధికారులను నిలదీస్తున్నారు. వినియోగించుకున్న విద్యుత్ చార్జీలకు అదనంగా రెట్టింపు సొమ్ము చెల్లిస్తున్న తమకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయవలసిన బాధ్యత అధికారులకు లేదా అని ప్రశ్నిస్తున్నారు. వేసవి కారణంగా వినియోగం పెరగడంతో లోవోల్టేజీ సమస్య ఉత్పన్నమైనట్టు ట్రాన్స్‌కో సిబ్బంది చెబుతున్నారు. ఈసమస్య పరిష్కారానికి మార్గాన్వేషణ చేయవలసిన ఆవశ్యకతను ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు గుర్తించి వినియోగదారులకు న్యాయం చెయ్యాలని పలువురు కోరుతున్నారు.

గోదావరి గట్లను పరిశీలించిన కేంద్ర బృందం



బోటులో విహరిస్తూ గోదావరి గట్లను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

యానాం, మే 9(ఆంధ్రజ్యోతి): యానాం పర్యటనకు వచ్చిన కేంద్ర జలవనరులు, ప్రజాపనుల శాఖల అధికారులు యానాం గౌతమి గోదావరి సరిహద్దు గట్లను పరిశీలించారు. యానాంలో పెండింగ్ ఉన్న కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించి తీరుతెన్నులు పరిశీలించేందుకు రెండు రోజుల పర్యటనకు వారు యానాం వచ్చిన విషయం తెలిసిందే. శుక్రవారం యానాం పరిపాలనాధికారి కార్యాలయంలో అధికారులకు ప్రస్తుత పరిస్థితిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఉదయం 10గంటలకు యానాం శివారు దరియాలత్తి జెట్టి వద్దకు చేరుకున్న బృందం అక్కడ నుంచి బోటులో గోదావరిలో పయనించారు. సావిత్రీనగర్ నుంచి కనకాలపేట వరకు ఉన్న గోదావరి గట్లు, మడఅడవుల పరిస్థితిని వారు పరిశీలించారు. వీరికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు వివరించారు. ఈపర్యటనలో స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏ మునిస్వామి, ప్రజాపనులు, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలికల సాధికారత మనందరి బాధ్యత

అంబాజీపేట, మే 9(ఆంధ్రజ్యోతి): కిశోర బాలిక సాధికారత మనందరి బాధ్యతని అంగన్‌వాడీసూపర్‌వైజర్లు వీఎస్‌వీ మహాలక్ష్మి, వెర్నమ్మ అన్నారు. కిశోర వికాశం- వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాచవరం, చిరతపూడి గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కిశోర బాలికలకు పునరుత్పత్తి ఆరోగ్యం, బాల్యవివాహాల పట్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లల పట్ల లింగ వివక్ష, అసమానతలు, ఉన్నత విద్య నైపుణ్యాలు, మార్గదర్శకత్వం, సైబర్ నేరాలు ఆన్‌లైన్ భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న నీరు



అంతర్వేది, మే 9(ఆంధ్రజ్యోతి): అంతర్వేది దండుపుంత వద్ద ఇటీవల ఏర్పాటుచేసిన పైపులైను నుంచి వృథాగా నీరు పోతోంది. గన్నవరం ప్రధాన పంటకాల్వ అయిన సఖినేటిపల్లి మండలం మూడు తూముల నుంచి అంతర్వేది దేవస్థానం మంచినీటి చెరువుకు నూతన పైపులైను ఏర్పాటు చేశారు. అంతర్వేదిలో మురికినీరు దిగే రహదారి పక్కన పైపులైను నుంచి వృథాగా నీరు పోతోంది. రోడ్డు కోతకు గురికావడం, వృథాగా నీరు పోతోందని స్థానికులు తెలిపారు. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సత్యనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ముమ్మిడివరం, మే 9(ఆంధ్రజ్యోతి): కొత్తలంకలోని శ్రీఅనంతలక్ష్మి సత్యవతి సమేత వివేక సత్యనారాయణస్వామివారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. గురువారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ సభ్యులు నడిమింది సూర్యప్రభాకరం, ముదునూరి వేణుగోపాలమూర్తిరాజు, కోర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేత

ముమ్మిడివరం, మే 9(ఆంధ్రజ్యోతి): రాణేలంక పంచాయతీ పరిధిలోని బలుసుల్లంకలో చిన్నం ప్రసాదరావు తాటాకిల్లు అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైంది. అమలాపురానికి చెందిన గుడ్ సీడ్ ఫౌండేషన్ అధినేత కుంచే రమణారావులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి వంట సామగ్రి, నిత్యావసరాలు, దుస్తులు, నగదు అందించారు. పినిపే శ్రీను, నక్కా మణికంఠ, నక్కా శివ, నక్కా గోవిందు, చిన్నం శ్రీను, పందిరి సుబ్బరాజు, నేలపూడి సుగంధకుమార్, నేరేడుమిల్లి శ్రీను పాల్గొన్నారు.

రేపు పి.గన్నవరం హైస్కూల్లో జాబ్‌మేళా

పి.గన్నవరం, మే 9(ఆంధ్రజ్యోతి): వాసంశెట్టి సత్యం ఫౌండేషన్, గిడ్డి శ్యామల రాణి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పి.గన్నవరం హైస్కూల్‌లో ఆదివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. టాటా ఎలక్ట్రానిక్స్, హోసూరుల్లో అప్రెంటిస్షిప్ ట్రైనీ అవకాశాలు ఉన్నాయన్నారు. 18ఏళ్ల నుంచి 25ఏళ్లలోపు ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు.

భారత్ విజయం సాధించాలి

మలికిపురం, మే 9(ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ మధ్య జరుగుతున్న భీకర యుద్ధ పోరులో భారత్ విజయం సాధించాలని కోరుతూ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు దేవాలయాల్లో శుక్రవారం పూజలు చేశారు. భారత్‌లో ఉన్న త్రివిధ దళాల అధినేతలకు, ప్రధాని నరేంద్రమోదీకి భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండాలని కేశనపల్లి సత్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ ఉగ్రవాదులపై తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా భారతీయులంతా నిలవాలని, ఇది ప్రతీకార చర్య కాదు, భారతీయుల ఆత్మగౌరవ చర్య అన్నారు.

కంటైనర్-ఐషర్‌వ్యాన్ ఢీ.. ట్రాఫిక్ జామ్

ముమ్మిడివరం, మే 9(ఆంధ్రజ్యోతి): రొయ్యల లోడుతో వెళుతున్న మినీ కంటైనర్ ఎదురుగా వస్తున్న ఐషర్ వ్యాన్‌ను ఢీకొంది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అమలాపురం నుంచి రొయ్యల లోడుతో వెళుతున్న కంటైనర్ అనాతవరం వచ్చేసరికి కంటైనర్ ముందు చక్రం విరిగిపోవడంతో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఐషర్ వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈఘటనలో ఐషర్ వ్యాన్ డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. ఐషర్ వ్యాన్, కంటైనర్ రోడ్డుపై నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. శుక్రవారం పెళ్లిళ్లు ఎక్కువగా ఉండడంతో పెళ్లిళ్లకు వెళ్లేవారు ఇబ్బంది పడ్డారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకుని రోడ్డుపై నిలిచిపోయిన ఐషర్ వ్యాన్, కంటైనర్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

విశ్రాంత సీఐ మంచాల మృతి



యానాం, మే 9(ఆంధ్రజ్యోతి): యానాంలో ఫ్రెంచ్ కాలం నాటి పుదుచ్చేరి పోలీస్‌శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన మంచాల వెంకట మాచర రాజారావు(97) శుక్రవారం ఉదయం మృతి చెందారు. 40ఏళ్ల పోలీస్ శాఖలో ఆయన పనిచేశారు. 1986లో ఉద్యోగ విరమణ చేశారు. యానాం సీఐ ఆడలరసన్, ఎస్ఐ పూనితీరాజ్, అల్లుడు ఫ్రెంచ్ పౌరుల ప్రతినిధి సాధనాల బాబు తదితరులు పార్థివ దేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పుదుచ్చేరి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక కురసాంపేట శ్మశన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. పుదుచ్చేరి ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసు లాంఛనలతో అంత్యక్రియలు నిర్వహించారు.

హడలిస్తున్న రక్త పింజరలు.. భయాందోళనలో ప్రజలు



మామిడికుదురులో స్థానికుల చేతిలో హతమైన రక్తపింజర

మామిడికుదురు, మే 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రక్త పింజర పాములు ప్రజలను హడలిస్తున్నాయి. పలు గ్రామాల్లో రక్త పింజర పాములను హతమార్చిన సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. శుక్రవారం మామిడికుదురు హైస్కూలు ప్రాంతంలో ఐదు అడుగుల రక్తపింజర పామును స్థానిక యువకులు కొట్టి చంపారు. సుదూర ప్రాంతాల నుంచి కంకర లారీల ద్వారా ఈ పాములు గ్రామాల్లోకి వచ్చి గ్రామాల్లో సంతతి అభివృద్ధి చెంది జన సమూహాల మధ్య తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

ఉచిత లివర్ పరీక్షలు

అమలాపురం టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని మెడ్ యునైటెడ్ ఆసుపత్రిలో శుక్రవారం ఉచిత లివర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి వాకర్స్ హెల్త్ క్లబ్ సభ్యుల ప్రోత్సాహంతో అధిక సంఖ్యలో పరీక్షకు హాజరయ్యారు. రూ.5వేలు విలువైన లివర్ పరీక్ష ఉచితంగా చేసిన మెడ్ యునైటెడ్ ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ కేవీఆర్ కిశోర్ ముఖ్య అతిథిగా పాల్గొనగా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, నూకల సత్యనారాయణ, మోకా వెంకటసుబ్బారావు, వలవల రెడ్డి నాయుడు, పట్నాల రమణ, కుడుపూడి త్రినాథ్, మహిళా వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షురాలు వై.అనంతలక్ష్మి, కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

తీరంలో మాక్‌డ్రిల్

అంతర్వేది, మే 9(ఆంధ్రజ్యోతి): అంతర్వేది తీర ప్రాంతంలో మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు.భారత్-పాకిస్థాన్ యుద్ధ నేపథ్యంలో సముద్ర తీరంలోగస్తీ చర్యలు చేపట్టారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు తెలపాలన్నారు. అంతర్వేది నుంచి సముద్ర తీరమంతా గస్తీ నిర్వహిస్తున్నట్టు మెరైన్ సీఐ నవీన్‌నరసింహమూర్తి తెలిపారు.


అధ్వానంగా ఉన్న అమలాపురం - గన్నవరం ప్రధాన లాకుల గేట్లు

శిథిలావస్థలో లొల్ల లాకులు

- సెంట్రల్ డెల్టాకు సాగునీరు అందించే లొల్ల లాకుల వ్యవస్థ అధ్వానం
- ధ్వంసమైన లాకు రెయిలింగ్
- ఆధునికీకరణ పనులు ఉల్లక్కేనా..!


ధ్వంసమైన బ్యాంకు కెనాల్ లాకులు

ఆత్రేయపురం, మే 9(ఆంధ్రజ్యోతి): అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం 1886లో సెంట్రల్ డెల్టా సాగునీరు అందించి పంటపొలాలను సస్యశ్యామలం చేసేందుకు నిర్మించిన లొల్ల లాకుల వ్యవస్థ శిథిలావస్థలో ఉంది. బొబ్బర్లంక వద్ద సెంట్రల్ డెల్టా ప్రధాన కాలువల నుంచి లొల్లలాకులవద్ద ముక్తేశ్వరం, గన్నవరం- అమలాపురం కాలువలుగా విడిపోయి రైతులకు సాగునీరు అందుతుంది. సెంట్రల్ డెల్టాకు లొల్ల లాకులు ఆయువపట్టుగా ఉంది. కోనసీమ జిల్లాలోని 16 మండలాల్లో సుమారు 2లక్షల ఎకరాలకు సాగునీరు, శివారు ప్రాంతాలకు తాగునీరు అందించే లొల్ల లాకుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోంది. లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న లాకులను పునర్నించేందుకు ప్రతిఏటా ప్రతిపాదనలతోనే సరిపెడుతున్నారు. గత ప్రభుత్వ హాయాంలో రూ.77 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించిన అతిగతీలేదు. గన్నవరం, అమలాపురం జంటలాకుల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. శిథిలలాకుల ద్వారానే రైతుకు సాగునీరు అందుతోంది. కోనసీమ జిల్లాలో ప్రధాన కాలువల ద్వారానే రైతులు తమ పంటపొలాలను సాగుచేసుకుంటున్నారు. అమలాపురం, ముక్తేశ్వరం, గన్నవరం ప్రధాన లాకులకు ఆధునీకరణ పనులు చేపట్టడం ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుంది.

క్లోజర్ పనులు ఎక్కడ..!

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సెంట్రల్ కాలువలకు సాగునీరు నిలుపుదలచేసి సుమారు 15 రోజులు కావస్తున్నా కాలువ ఆధునీకరణ పనులు ఊసేలేకుండాపోయింది. పూర్తిస్థాయిలో రైతులకు సాగునీరు అందించాలంటే కాలువల ఆధునీకరణ చేపట్టాలి. ఇప్పటికే ప్రధాన కాలువల వెంబడి ఆక్రమణలకు గురికావడంతో మూసుకుపోయి సాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గత ప్రభుత్వ హాయాంలో కాలువలలో గంపమట్టితీసిన దాఖలాలు కానరాలేదు. శివారు రైతులకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది.

లొల్లలాకులు ఆయువుపట్టు...

కోనసీమకు గుండెకాయలాంటి ప్రధాన కాలువలు లొల్ల లాకుల నుంచే విడిపోయి రైతులకు సాగునీరు అందిస్తున్నారు. కాలువలు మూసివేయ్యగానే క్లోజర్ పనులు చేపట్టాల్సి ఉంది. మూసుకుపోయిన కాలువలను పూడిక తీయించడం గేట్ల వద్ద చెత్తాచెదారం పిచ్చిమొక్కలను తొలగించడం లాకుల గేట్లకు, స్లూయిజ్‌లకు మరమ్మతులు గ్రీజ్ ఆయిల్ పెట్టడం వంటి ఆధునీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం ఆ పనులు చేపడతారోలేదో తెలియని పరిస్థితి. మూడు లాకుల గేట్లు తుప్పపట్టిపోయాయి. స్లాబ్ పెచ్చులు ఊడిపోయి ఊసలు బయటకు వస్తున్నాయి. లాకులకు బీటలు వారి పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయి. బ్యాంకొకెనాల్ లాకులపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. లాకు రెయిలింగ్ సైతం ధ్వంసమైంది. లాకుల వ్యవస్థ కుంగిపోవడంతో పెనుప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టి లాకుల వ్యవస్థను ఆధునీకరించి క్లోజర్ పనులు చేపట్టాలి.

వెల్ల కాలువలోకి దూసుకెళ్లిన ధాన్యం లారీ

ద్రాక్షారామ, మే 9 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెల్ల కాలువలోకి ధాన్యంలోడుతో వెళుతున్న లారీ దూసుకువెళ్లింది. మండలంలో ఉండూరు నుంచి ధాన్యంలోడుతో రామచంద్రపురం వస్తున్న లారీ వెల్ల వద్ద కాలువలోకి అదుపు తప్పి దూసుకు వెళ్లింది. కాలువలో తిరగబడింది. దీంతో కాలువ నీటిలోపడి ధాన్యం తడిచిపోయింది. టీడీపీ నేత వాసంశెట్టి సత్యం ప్రమాద సంఘటనను పరిశీలించారు. ధాన్యం రైతుతో మాట్లాడారు. రైసుమిల్లర్‌కు ఫోన్‌చేసి మద్దతు ధరకే కొనుగోలు చేయాలని కోరారు.



హసన్‌బాదలో జాతీయ జెండాలతో ప్రదర్శన చేస్తున్న గ్రామస్థులు

సెల్యూట్ సింధూర్..

హసన్‌బాదలో సంఘీభావంగా ర్యాలీ

ద్రాక్షారామ, మే 9(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం మండలం హసన్‌బాదలో శుక్రవారం సెల్యూట్ ఆపరేషన్ సింధూర్ పేరుతో గ్రామస్థులు భారత సైన్యానికి సంఘీభావంగా ప్రదర్శన జరిపారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో గ్రామస్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు. జయహో భారత్.. పాకిస్తాన్ ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు మాట్లాడుతూ పహల్గాంలో టూరిస్టులపై ఉగ్రవాదుల మారణహోమానికి ప్రతీకారంగా ప్రధాని మోదీ ఆదేశాలతో భారతదేశ త్రివిధ దళాలు ఆపరేషన్ సింధూర్ చేపట్టిన ఉగ్రశిబిరాలను కూల్చివేసిన సైన్యానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌వో నరహరశెట్టి సత్తిబాబు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, రెవెన్యూ, ఉపాధి సిబ్బంది, గ్రామస్థులు, యువత పాల్గొన్నారు.

సాయుధ దళాల పోరాటం చూస్తే గర్వంగా ఉంది

● మంత్రి సుభాష్



రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 9(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద నిర్మూలన లక్ష్యంగా ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత దేశ త్రివిధదళాలు చేస్తున్న పోరాట పటిమచూసి భారతీయులందరికీ గర్వంగా ఉందని మంత్రి సుభాష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మతంచూసి ఉగ్రవాదులు ప్రాణాలు తీయడం బాధాకరమన్నారు. ప్రధాని ఆదేశాలతో పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసిన ఆర్మీ జవాన్లకు ఉద్యమ నమస్కారాలు అన్నారు. ఎంతో సాహోసోపేతంగా ఆర్మీ జవాన్లు చేపట్టిన ఈ ఆపరేషన్ ఉగ్రవాదుల గుండెల్లో సింహస్వప్నంలా నిలిచిందన్నారు. త్రివిధ దళాలకు అండగా నిలుద్దామన్నారు. రాబోయే రోజుల్లో భారత్‌పై చూడాలంటే పాకిస్థాన్‌కు, ఉగ్రవాదసంస్థలకు వెన్నులో వణుకుపుట్టి భయపడే పరిస్థితి రావాలన్నారు.

యుద్ధంలో మరణించిన సైనికుడికి సంతాపం

మండపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): పాక్‌తో భారత్ సైనికులు చేస్తున్న యుద్ధంలో జమ్ము కాశ్మీర్‌లో ఆసువులుబాసిన తెలుగు సైనికుడు మరణించటం బాధాకరమని పలువురు నేతలు అన్నారు. జమ్మూకాశ్మీర్‌లో లైన్‌ఆఫ్ కంట్రోల్‌వద్ద పాకిస్థాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో అనంతపురంనకు చెందిన సైనికుడు మురళీనాయక్ వీరమరణం పొందటం అతడి ధైర్యం, త్యాగానికి ప్రతిక అని నేతలు అన్నారు. నాయక్ మరణం పట్ల మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలా కృష్ణ, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనా సత్యనారాయణ, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కె.సాయిరాం తదితరులు సంతాపం తెలిపారు.

అన్ని మతాల వారు ప్రార్థనలు చేయండి

కొత్తపేట, మే 9(ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధవాతావరణం నేపథ్యంలో దేశం కోసం అన్నిమతాల వా రు ప్రార్థనలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం కోరారు. శుక్రవారం ఆయన కొత్తపేటలో మాట్లాడుతూ మన దేశం కోసం పోరాడుతున్న త్రివిధ దళాల వారికి విజయం చేకూరాలని భారత్‌పౌరులు ఎటువంటి ప్రాణహాని కలుగకుండా ఉండేలా ఎవరి మత విశ్వాసాల ప్రకారం వారు పూజలు, ప్రార్థనలు చేయాలన్నారు. భారత దేశ ప్రజలు త్రివిధ దళాలకు మద్దతుగా ఉండాలని పేర్కొన్నారు.


ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో పూజల అనంతరం జడ్జి కుటుంబ సభ్యులు

కేశవస్వామి ఆలయంలో సివిల్ జడ్జి పూజలు

ఆత్రేయపురం, మే 9(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శుక్రవారం మాడుగుల జూనియర్ సివిల్‌జడ్జి లావణ్య కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం శేష వస్త్రం సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసు నమోదు


కొత్తపేటలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

కొత్తపేట, మే 9(ఆంధ్రజ్యోతి): వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జి.సురేంద్ర హెచ్చరించారు. శుక్రవారంరాత్రి బోడిపాలెం వంతెన సమీపంలో వాహనాలను తనిఖీలు చేస్తు వాహనదారులు మద్యం సేవించారా అనే దానిపై డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేంద్ర మాట్లాడుతూ ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటుచేసుకుంటాయని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌సీ వీర్రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు గ్రంధి మృతి

● నివాళులర్పించిన మంత్రి సుభాష్


గ్రంధి వెంకటరాజు(ఫైల్)


గ్రంధి వెంకటరాజుమృతదేహానికి నివాళి అర్పిస్తున్న మంత్రిసుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ),మే9(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం పట్టణానికి చెందిన దాక్షాయణి ఎంటర్ ప్రైజె స్ అధినేత, సీనియర్ టీడీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గ్రంధి వెంకటరాజు (60)గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన మృతదేహాన్ని రాష్ట్రమంత్రి వాసంశెట్టి సుభాష్ సందర్శించి నివాళులర్పించారు. గ్రంధి వెంకటరాజు నిబద్ధత కలిగిన నాయకుడని, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. గ్రంధి వెంకట రాజు మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

మౌలిక సదుపాయాలకు ఓఎన్జీసీ సహకారం

● ఎమ్మెల్యే బండారు సత్యానందరావు


పినపళ్ల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, మే9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో జరుగుతున్న ఓఎన్జీసీ గ్యాస్, చమురు తవ్వకాలవల్ల మౌలిక సదుపాయాలు ధ్వంసమవుతున్నాయని ఆ సంస్థ గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం అవసవరమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలం పినపళ్ల, పెదపళ్లలో చెత్త తరలింపునకు ఓఎన్జీసీ అందించిన ట్రాక్టర్లు, పెదపళ్ల పీహెచ్‌సీకి ఓపీ షెడ్‌లను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఓఎన్జీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సంతునుదాస్‌లు శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ఓఎన్జీసీ సంస్థల భారీ వాహనాల రాకపోకలవల్ల అనేక రోడ్లు దెబ్బతింటున్నాయని రోడ్లు, ఇతర సదుపాయాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. గ్యాస్ తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరుకు కృషి చేస్తున్నామని వీటి లో బాగంగానే ఈరోజు ప్రారంభోత్సవాలు చేస్తున్నామని ఈడీ సంతునుదాస్ చెప్పారు. ఈకార్యక్రమాలలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, సర్పంచ్‌లు సంగిత సుభాష్, యేడిద సత్యశ్రీ, ఎంపీ డీవో ఎ.రాజు, తహశీల్దార్ ప్రకాష్‌బాబు, నాయకులు వక్కపట్ల లక్ష్మణరావు, సలాది నాగేశ్వరరావు, గారపాటి త్రిమూర్తులు, గారపాటి శ్రీనివాస్, నామాల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజావేదిక లక్ష్యం

● ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



మండపేటలో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే వేగుళ్ల, రావులపాలెం ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బండారు

మండపేట, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రారంభించారని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ స్థానిక ఎమ్మెల్యే వేగళ్ల జోగేశ్వరరావు అన్నారు. పట్టణ టీడీపీ కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. నియోజకవర్గపరిధిలో గల పలువురు పార్టీ కార్యాలయానికి చేరుకుని వారి సమస్యలను ఎమ్మెల్యే వేగుళ్లకు వివరించారు. వేగుళ్ల వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖలకు సంబంధించిన వాటి గురించి తక్షణమే అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పట్టణంలో గొల్లపుంతలోవున్న టిడ్కో గృహాల సముదాయంలో సమస్యల గురించి లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. అలాగే నివేశన స్థలాలు, విద్యుత్ సమస్యలు, పింఛన్ల కోసం ఫిర్యాదు చేయగా వాటిని ఆయా సంబంధిత అధికా రులకు సమస్యలను వివరించి సత్వరమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమినేతలు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

రావులపాలెం, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్ వేదికగా వచ్చే సమస్యలను తెలుసుకుని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నా రు. రావులపాలెం క్యాంపుపార్టీ కార్యాలయంవద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని ప్రజలవద్ద నుంచి వినతులు స్వీకరించారు. ఈ వినతులను ఆయా శాఖల అధికారులకు పంపి వాటి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ఆత్రేయపురం, మే 9(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి రామకృష్ణ జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో కోనసీమ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు బండారు సంజీవ్ ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి 50 టీమ్‌లు ఈ టోర్నమెంటులో పాల్గొననున్నారు. తొలిరోజు ర్యాలి, పోలవరం జట్లు తలపడ్డాయి. ర్యాలి యూత్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రికెట్ పోటీలలో ప్రథమస్థానం విజేతకు రూ.50వేల ప్రైజ్ మని, ట్రోఫి, ద్వితీయ స్థానం విజేతకు రూ.30వేలు ప్రైజ్‌మని, ట్రోఫి అందిచనున్నారు. ఈ హైస్కూల్ క్రీడాప్రాంగణాన్ని బండారు సంజీవ్ రూ.3లక్షల వ్యయంతో క్రీడాప్రాంగణాన్ని సొంత ఖర్చుతో అభివృద్ధి చేశారు. అనంతరం ర్యాలి యువత బండారు సంజీవ్‌ను ఘనంగా సత్కరించారు. కూటమి నాయకులు మద్దూరి సుబ్బారావు, పెండెం వెంకన్న, మెర్ల నాగేశ్వరరావు, రామకృష్ణ, బండారు బాబి, సత్యనారాయణ, రవిచంద్ర పాల్గొన్నారు.


ర్యాలిలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న యువనాయకుడు బండారు సంజీవ్

గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు


వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి రత్నకుమారి

కపిలేశ్వరపురం, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా వైద్యాధికారి డి.రత్నకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 19మంది గర్భిణులను పరీక్షించి రక్తపరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఆయా సమయాల్లో చేయించుకోవాల్సిన హెల్త్ చెకప్ ప్రాముఖ్యత, వ్యాక్సినేషన్, ప్రసవ ప్రణాళిక, ఆసుపత్రి ప్రసవ ప్రాముఖ్యత, 102, 108 వాహనాల వినియోగం, ఇ-జె.ఎస్.వై, ఆరోగ్య ఆసరా, వాటి గురించి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో జె.మల్లిఖార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, హెల్త్ విజిటర్ టి.మేరీమణి, ఆరోగ్య, ఆశాకార్యర్తలు పాల్గొన్నారు.

రాయవరం: మండలంలోని మాచవరం, రాయవరం పీహెచ్‌సీల్లో శుక్రవారం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయా పీహెచ్‌సీల వైద్యు లు మణికంఠ, అనిరుథ్, రమ్యశ్రీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు జరిపారు. ఈసందర్భంగా గర్భిణలకు రక్తహీనత వల్ల కలిగే నష్టాలు పౌష్టికాహారం తీసుకోవడంవల్ల కలిగే ప్రయోజనాలు, క్రమం తప్పకుండా వైద్యులచే పరీక్షలు చేయించుకోవాలని సూ చించారు. అనంతరం గర్భిణలకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.34లక్షలు

ఆత్రేయపురం, మే 9(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించి అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవలద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,34,012 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.


వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు దృశ్యం

క్రీడలతో అంతర్జాతీయ ఖ్యాతి

రావులపాలెం, మే 9(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు రాణించే ఆ ప్రాంతానికి అంతర్జాతీయ ఖ్యాతి లభిస్తుందని వక్తలు అన్నారు. రావులపాలెం జడ్పీ బాలుర పాఠశాలలో వేసవి నేపథ్యంలో కోచ్ సత్తి అక్షయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఫుట్‌బాల్ శిక్షణా తరగతులు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర తెలుగురైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు క్రీడా పోటీలను ప్రారంభించి క్రీడాకారులను ఉత్తేజ పరిచేందుకు కొంతసేపు వారు కూడా క్రీడలను ఆడారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నందం వీరవెంకటసత్యనారాయణ, సీఆర్సీ రూపశిల్పి గొలుగూరి వెంకటరెడ్డి, సీఆర్సీ ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి వీరరాఘవరెడ్డి, బొంతు రాంబాబు, అంబటి కిశోర్ పాల్గొన్నారు.


రావులపాలెం జడ్పీ పాఠశాలలో వేసవి ఫుట్‌బాల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నార్కెడిమిల్లిలో మొరాయించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఆత్రేయపురం, మే 9(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లిలో ప్రజలు విద్యుత్ సమస్యలతో కొట్టుమి ట్టాడుతున్నారు. గత రెండు రోజుల క్రితం వీధిలైట్లు వెలగకపోవడంతో గ్రామం అంధకారంలో కొట్టిమిట్టాడింది. ఈ సమస్యను పరిష్కరాం జరిగిన తరుణంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మొరాయించింది. గ్రామంలోని రెండు వీధులకు సప్లై అందించే ట్రాన్స్‌ఫార్మర్ మొరాయించడంతో అంతరాయం ఏర్పడింది. సుమారు 150 గృహాలు అంధకారంలో కొట్టిమిట్టాడుతున్నాయి. స్థానిక లైన్‌మెన్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై శుక్రవారం సాయం త్రం ట్రాన్స్‌కో ఏఈ అశోక్ దృష్టికి తీసుకునివెళ్లారు. ఈ విషయం తన దృష్టికి రాలేదని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

కిశోరి బాలికలకు అవగాహన


వెదురుపాకలో కిశోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాయవరం, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక, పసలపూడి గ్రామాల్లో కిశోరి వికాసం ఫేజ్-2 శిక్షణా తరగతుల్లో బాగంగా శుక్రవారం కిశోరి బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాయవరం పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ సరోజిని మాట్లాడుతూ బాల్య వివాహాలవల్ల కలిగే దుష్ప్రబావాలను వివరించారు. అవగాహనతోనే బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమన్నారు. పసలపూడి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త డి.ఆదిలక్ష్మి కిశోరి బాలికల్లో యుక్త వయస్సులో కలిగే మార్పులను వివరించారు. బాలికల అక్రమ రవాణా గురించి ట్రోల్ ఫ్రీ నెంబర్ గురించి వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో జీఎంఎస్‌కే సౌజన్య ప్రియాంక, ఏఎన్ఎం మణికుమారి, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీకార్యకర్తలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

2047 విజన్ లక్ష్యంగా ప్రణాళికలను సిద్ధం చేయాలి

● అధికారులతో సమీక్షలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రసాద్

మండపేట, మే9(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంగా గ్రామస్థాయి నుంచి ఆదా యాన్ని పెంచి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అధికారులు ప్రణాళికలను రూపొందించాలని మండపేట నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి కె.ప్రసాద్ అధికారులకు పిలుపునిచ్చారు. మండపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన నియోజకవర్గపరిధిలోగల మండలస్థాయి అధికారులతో నియోజకవర్గ సమగ్రాభివృద్ధి, ప్రతియేటా 15శాతం మేర ఆదాయంపెంపు అంశాలపై చర్చించటంతో పాటు పరిశ్రమలు, వ్యవసాయా ధారిత పరిశ్రమలు ద్వారా ఆదాయం పెంపుతోపాటు గ్రామీణ యువతకు ఉపాధి కల్పించటం లక్ష్యంగా ఉద్యోగులు పనిచే యాలన్నారు. ఆదాయ వనరుల పెంపుకు తీసుకోవాల్సిన చర్యలు గురించి ఆయన అధికారులతో చర్చించి వారినుంచి సూచనలుసలహాలను తీసుకున్నారు. నియోజకవర్గ సమగ్రా భివృద్ధికి సంబంధించి 2029 వరకు ప్రణాళిక తయారు చేయటంతోపాటు, 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంగా అన్నిరంగాల్లో గ్రామాలు అభివృద్ధిదిశగా పనిచేసేలా రూపకల్పన చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి కుటుంబానికి ఆర్థిక పరిపుష్టి పెరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆ విధంగా ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఆయన అధికారుల నుంచి పలు సూచనలు, సలహాలను తీసుకున్నారు. సమావేశంలో అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి కె.సత్యనారాయణ, మండపేట ఎంపీడీవో సత్యనా రాయణమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, తహసీల్దార్ కె.రత్నకుమారి, అధికారులు పాల్గొన్నారు.